మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 93 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





## టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్..

### హాట్‌స్టార్‌లో వ్యూయర్‌షిప్ ఎంతంటే?

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): 13 ఏళ్ల ఐసీసీ ట్రోఫీ నిరీక్షణకు తెరదించుతూ పొట్టికప్‌లో విశ్వవిజేతగా నిలిచింది భారత్. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో టీమ్ఇండియా ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది.మ్యాచ్ నాటకీయ మలుపులు తిరుగుతూ.. తీవ్ర ఉత్కంఠ రేపుతూ సాగింది. దీంతో అభిమానులు టీవీలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి మ్యాచ్‌ని వీక్షించారు. ఓటీటీ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ డిస్నీంహాట్‌స్టార్‌లో భారత్, దక్షిణాఫ్రికా ఫైనల్ మ్యాచ్‌కు భారీస్థాయిలో వ్యూయర్‌షిప్ వచ్చింది. ఈ మ్యాచ్‌ను 5.3 కోట్ల మంది వీక్షించినట్లు సదరు సంస్థ పేర్కొంది.భారత్, ఆసీస్ మధ్య జరిగిన నవంబర్ 20, 2023న జరిగిన వన్డే వరల్డ్ ఫైనల్‌ను రికార్డు స్థాయిలో 5.9 కోట్ల మంది వీక్షించారు. ఇప్పటివరకు మరే క్రికెట్ మ్యాచ్‌కు ఈ స్థాయిలో లైవ్ స్ట్రీమింగ్ వ్యూయర్‌షిప్ రాలేదని ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు. కానీ, అప్పటి ఫైనల్ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఓటమిపాలైంది. ఈ టీ20 ప్రపంచ కప్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌ను హాట్‌స్టార్‌లో 3.9 కోట్ల మంది వీక్షించారు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేసింది. టీవీల్లో ఎంతమంది వీక్షించారనే గణాంకాలను బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ (%దీూ=జ%) వారం రోజుల తర్వాత వెల్లడిస్తుంది.



# నిబద్ధత గల నాయకుడు డీఎస్

### డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారు - డి.శ్రీనివాస్‌కు నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాసభౌతికయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించిన తర్వాత డీఎస్ కుమారులు సంజయ్, అరవింద్‌తో మాట్లాడి సీఎం ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీనివాస్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ కు తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయన వెంట ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్

మిగతా 2లో..

## రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

- సంపద సృష్టిస్తాం సంపదను ప్రజలకు పంచుతాం..
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన బేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో..



## కేదార్‌నాథ్‌లో మంచు ఉప్పెన..

కేదార్‌నాథ్ (ప్రజా మంటలు): ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం 'కేదార్ నాథ్ ధామ్ సమీపంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. కేదార్‌నాథ్ ఆలయానికి నాలుగు కిలోమీటర్ల ఎగువన ఉన్న గాంధీ సరోవర్‌పై ఆదివారం

మిగతా 2లో..





## హైదరాబాద్ నగరంలో పలు చోట్ల భారీ వర్షం

హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్ నగరంలో గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ కూడా నగరంలోని పలు ప్రాంతాలు భారీ వర్షంతో తడిసి ముద్దయ్యాయి.

జూబ్లీహిల్స్, కూకట్ పల్లి, బేగంపేట, కేపీహెచ్ బీ కాలనీ, దిల్ సుఖ్ నగర్, ప్రగతి నగర్, హైదర్ నగర్, బోయిన్ పల్లి, నిజాంపేట్, మైత్రీవనం, యూసఫ్ గూడ, పంజాగుట్ట, బోరబండ, ఉప్పల్, ఎల్బీనగర్, రామంతపూర్, హయత్ నగర్, తిరుమలగిరి, ఎల్బీనగర్, బొల్లారం, అమీర్ పేట, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగింది.

## 'అమ్మ పేరుతో ఒక మొక్క'..

### దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రజలకు సందేశమివ్వడంతో పాటు.. వారితో మమేకమయ్యేందుకు ప్రతి నెలా చివరి ఆదివారం ఏర్పాటు చేసే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ప్రధాని మోదీ పునఃప్రారంభించారు.వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి రేడియో ప్రసంగం చేశారు. మరోసారి ఎన్‌డీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినందుకు దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో కొత్త ప్రచారానికి పిలుపునిచ్చారు.2024 సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికలుగా మోదీ పేర్కొన్నారు. ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, 65 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారని అన్నారు. ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని తిరిగి ఎంచుకున్నందుకు ఓటర్లకు కృతజ్ఞతలు

మిగతా 2లో..



## ఈశాన్య నైజీరియాలో ఘోరం

### ఆత్మాహుతి దాడుల్లో 18 మంది దుర్మరణం

ఈశాన్య నైజీరియాలో ఘోరం జరిగింది. ఆత్మాహుతి దాడుల్లో 18 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 40 మందికిపైగా గాయపడ్డారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో స్టేట్‌లో శనివారం మహిళా సూసైడ్ బాంబర్లు ఆత్మాహుతి దాడులకు పాల్పడ్డారు. గ్వోజా పట్టణంలోని ఓ ఆస్పత్రిపై ఆత్మాహుతి దాడి జరిగింది. అదేవిధంగా ఓ పెళ్లిలో ఇద్దరు మహిళలు బాంబులు కట్టుకొని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు.పెళ్లిలో మరణించిన వారి అంత్యక్రియలు నిర్వహిస్తుండగా మరో మహిళ ఆత్మాహుతి దాడికి పాల్పడింది. ఇలా మొత్తం మూడు ఆత్మాహుతి దాడుల్లో కలిపి 18 మంది మరణించారు. 40 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం వివిధ ఆస్పత్రులకు తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతుల్లో మహిళలు, చిన్నారులు, గర్భిణీలు ఉన్నారు.గ్వోజాలోని సెక్యూరిటీ చెక్ పోస్టు దగ్గర మరో దాడి జరిగింది. 2014లో ఉత్తర బోర్నో ప్రాంతంలోని గ్వోజాను బోకోహరం తీవ్రవాదులు స్వాధీనం చేసుకున్నారు. నైజీరియా భద్రతా బలగాలు 2015లో గ్వోజాను తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి.


మిగతా 2లో..

## లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఓటమికి.. ఆప్ కారణమన్న కాంగ్రెస్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)పై కాంగ్రెస్ నిందలు వేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో కూటమి ఓటమికి ఆప్ కారణమని ఆరోపించింది. ఆప్ మద్యం పాలసీ స్కామ్ వల్లనే ఢిల్లీలో ఓడామని కాంగ్రెస్ నేత అభిషేక్ దత్ అన్నారు. ఎక్సైజ్ కుంభకోణాన్ని కాంగ్రెస్ బహిర్గతం చేసినప్పుడు సరైన దర్యాప్తు జరుపాలని ఆప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి 18 నెలలు గడిచినా ఈడీ, సీబీఐ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అయితే లోక్‌సభ ఎన్నికలకు నెల ముందు సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని ఆయన అన్నారు.

కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌తో కలిసి పోటీ చేయకపోతే కాంగ్రెస్ సీట్లు పెరిగేవని అభిషేక్ దత్ అభిప్రాయపడ్డారు. ఆప్ ఎక్సైజ్ స్కాం కారణంగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నష్టపోయిందని ఆరోపించారు. 'కుంభకోణంలో ప్రమేయం ఉన్నందున సత్యేందర్ కుమార్ జైన్ జైలులో ఉన్నారు. మనీష్ సిసోడియా కూడా జైలులో ఉన్నారు. వారందరి వల్ల కాంగ్రెస్ నష్టపోయింది' అని వ్యాఖ్యానించారు.మరోవైపు ఢిల్లీలో తాగు నీటి ఎద్దడిపై నిరసన చేసిన ఆప్ మంత్రి అతిషి పైనా అభిషేక్ దత్ మండిపడ్డారు. ధర్నా పేరుతో ఆమె డ్రామా చేస్తున్నారని ఆరోపించారు. దీని వల్ల ఆప్ నష్టపోతుందని అన్నారు. 'ప్రజలకు పూర్తి సౌకర్యాలు కల్పించడమే మంత్రి పని. ఢిల్లీలో నీళ్లు లేవు. వారు ధర్నా చేస్తున్నారు' అని విమర్శించారు.

## ప్రజా నాడి




### ఏపీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి

# సర్వం సిద్ధం



- రూ.7 వేల పెన్షన్ అందించనున్న చంద్రబాబు సర్కారు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలుపుకుంటున్న కూటమి ప్రభుత్వం
- పెనుమాక గ్రామంలో స్వయంగా పెన్షన్ అందించనున్న సీఎం చంద్రబాబు

అమరావతి,జూన్30(ప్రజా మంటలు): ఏపీలో రేపు (జులై 1) ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెరిగిన పెన్షన్ రూ.4 వేలతో పాటు, ఏప్రిల్ నుంచి మూడు నెలల పెంపు రూ.3 వేలతో

మిగతా 2లో..

## ఏపీలో పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు..

### త్వరలో కొత్త నోటిఫికేషన్

అమరావతి (ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత డీఎస్సీ నోటిఫికేషన్ ను రద్దు చేసింది. కొత్త నోటిఫికేషన్( %ఙూజ అశీఱటఱషaఱశీఅ%) త్వరలో విడుదల చేస్తుండడంతో ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ను రద్దు చేస్తూ జీవో జారీ చేసింది. గత ప్రభుత్వం 6,100 టీచర్ పోస్టుల(%ఖుఎష్ట్రవతీ ూశీర్ం%) కు నోటిఫికేషన్ ఇవ్వగా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల మేనిఫెస్టో(%మీఱఅఱటవర్శీ%) లో ఇచ్చిన

మిగతా 2లో..



మొదటి పేజీ తరువాయి

## ఏపీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

కలిపి రేపు రూ.7 వేలు అందించనున్నారు.కూటమి ప్రభుత్వం మొదటి నెల నుంచే ఎన్నికల హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు పింఛను పెంపు తొలి నెల నుంచే అమలు చేస్తున్నారు. జులై 1న రాష్ట్ర వ్యాప్తంగా 65.31 లక్షల మందికి పింఛన్ల పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటుండడం విశేషం. మంగళగిరి నియోజకవర్గంలోని పెనుమాకలో లబ్ధిదారులకు చంద్రబాబు స్వయంగా పింఛను ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,20,097 మంది సిబ్బందితో పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి అధికార యంత్రాంగం సమాయత్తమైంది.మొత్తం 28 విభాగాలకు చెందిన లబ్ధిదారులకు పెంచిన పింఛను అందజేయనున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్య కారులు, కళా కారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్ జెండర్స్ వంటి వారికి ఇకపై రూ.4000 పింఛను ఇవ్వనున్నారు. దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ ను రూ.3000 నుంచి ఒకేసారి రూ.6000 పెంచారు. తీవ్ర అనారోగ్యంతో ఉండే వారికి ఇచ్చే పింఛను రూ.5000 నుంచి రూ.15000 పెంపుదల చేశారు. ఈ విభాగంలో 24,318 మంది పెన్షన్ అందుకోనున్నారు. పెన్షన్ల పెంపు వల్ల ప్రభుత్వానికి నెలకు రూ.819 కోట్ల అదనపు వ్యయం కానుంది. కాగా, పింఛన్ల కోసం రేపు ఒక్క రోజులో రూ.4,408 కోట్లు పంపిణీ చేయనున్నారు.

## ఏపీలో పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు..

హామీ మేరకు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. ఒండు, మూడు రోజుల్లో కొత్త నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం కసరత్తులు చేస్తుంది. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబుఈనెల 13న సీఎంగా బాధ్యతలు చేపట్టి డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు.

**మెగా డీఎస్సీలో పోస్టులు**

మెగా డీఎస్సీలో 16,347 పోస్టులను ప్రభుత్వం ఇంతకు ముందే ప్రకటించింది. అందులో ఎస్‌జీటీ 6,371, స్కూల్ అసిస్టెంట్స్ 7,725, టీజీటీ 1,781, పీజీటీ 286, పీఈటీ 132, ప్రిన్సిపల్స్ 52 పోస్టులను భర్తీ చేసేందుకు నిర్ణయించింది. అయితే ఇప్పటికే టెట్ అర్హత సాధించిన వారికి ఒక డీఎస్సీ నోటిఫికేషన్, ఇప్పటి వరకు టెట్ అర్హత సాధించనివారికి టెట్‌తో పాటు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది .

## ఈశాన్య నైజీరియాలో ఘోరం

అప్పటి నుంచి బోకోహరం తీవ్రవాదులు గ్వోజాపై దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటివరకు ఈ దాడుల్లో 40 వేల మంది చనిపోగా, 20 లక్షల మంది దాకా నిరాశ్రయులయ్యారు.

## మంచు ఉప్పెన విరుచుకుపడింది

చోరాబరి హిమానీనదంలోని గాంధీ సరోవర్ ఎగువ ప్రాంతం నుంచి పెద్దమొత్తంలో మంచు కిందికి దూసుకొస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆలయ సందర్శనకు వెళ్లిన భక్తులు ఇదంతా తమ ఫోన్‌లలో చిత్రీకరించారు.ఈ ఘటన కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్‌వార్ తెలిపారు. కేదార్‌నాథ్ సహా మొత్తం ప్రాంతం సురక్షితంగా ఉందని చెప్పారు. గత ఏడాది సైతం ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. దీంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్, వాడియా ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంలో సర్వేలు నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. హిమాలయ ప్రాంతంలో ఇటువంటివి సాధారణమేనని తెలిపారు. అయితే, కేదార్‌నాథ్ ధామ్ ప్రాంతంలో భద్రతను మెరుగుపరచాలని సూచించారు.

## 'అమ్మ పేరుతో ఒక మొక్క'..

### దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియపై తనకున్న విశ్వాసాన్ని ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా "ఏక్ పేడ్ మా కే నామ్" పేరుతో తీసుకొచ్చిన కొత్త ప్రచారం గురించి ప్రస్తావించారు. "మా అమ్మ పేరుతో నేను మొక్క నాటాను. ప్రతి ఒక్కరూ తమ తల్లులను గౌరవించేలా ఒక మొక్కను నాటండి " అని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే నెలలో జరగనున్న ఒలింపిక్స్‌లో పాల్గొననున్న భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేస్తారని దేశం ఆశిస్తోందన్నారు. వారిని ప్రోత్సహించేందుకు "చీర్4భారత్" హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించాలని కోరారు.

## నిబద్ధత గల నాయకుడు డీఎస్

కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, మాజీ మంత్రి మండల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.కాగా, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ (75) కన్నుమూశారు. కొద్దికాలంగా అనా రోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం గుండెపోటుతో జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. డీఎస్ మృతిపై ప్రధాని మోదీ ట్విట్టర్‌లో సంతాపం తెలిపారు. ఆయన మరణం తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు.విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన గొప్ప వ్యక్తి ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్ ) అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ పీసీసీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్‌భౌతికయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు (%ుతీఱఎబ్వ%). కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడుగా 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డీఎస్ ఎంతో కృషి చేశారు.2009లోనూ డీఎస్ సారధ్యంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. పదవులపై తనకు ఎప్పుడూ ఆశ లేదని డీఎస్ అనేవారు. డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారన్నారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలబడుతుందని చెప్పారు. కుటుంబ సభ్యులతో చర్చించి డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం. డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. కాగా, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ (75) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం గుండెపోటుతో జూబ్లీహిల్స్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే.

## మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్న గనవేని మల్లేష్ యాదవ్



మల్లాపూర్ జూన్ 30 (ప్రజామంటలు):

యువ నాయకుడు గనవేని మల్లేష్ యాదవ్ మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఆరు రాష్ట్రాలలో వివిధ రంగాలలో సేవలు అందించిన వారికి మాజీ ప్రధాని భారత రత్న పీవీ నర్సింహా రావ్ జయంతి ఉత్సవాలు 2024 సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్ లో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ వేడుకలలో గిన్నిస్ బుక్ రికార్డు అవార్డు గ్రహీత విశ్వకళా విరాట్ బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణ ఆచార్య ప్రముఖ సినీ హాస్య నటుడు ఆర్ఎస్ నంద నిర్వాహకులు సంస్థ జాతీయ చైర్మన్ ఫ్లోజ్ రాజ్ కుమార్ చేతుల మీదుగా యువకులకు స్ఫూర్తిగా నిలుస్తూ,యూత్ డెవలప్మెంట్, మరియు సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించిన గనవేనిమల్లేష్ యాదవ్ కి నందిఅవార్డుని అందచేశారు.

**జగిత్యాల జిల్లాలో కొన్నేండ్లుగా మల్లేష్ యాదవ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు:** వికలాంగుడి కృత్రిమ కాలుకోసం లక్ష ఇరవై ఐదు వేల ఎల్ ఓ సి ఇప్పించి కృత్రిమ కాలు పెట్టించడం.నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం, మెడికల్ క్యాంపు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం, ఇద్దరు వికలాంగులకు రెండు లక్షల విలువ గల రెండు స్కూటీ లు కవిత చే ఇప్పించడం గల్ఫ్ లో మృతి చెందిన మృత దేహాలను తెప్పించి ఉచిత అంబులెన్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేసి తెప్పించడం, వేసవి కాలంలో ప్రజల దాహార్తీ తీర్చడానికి చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు బెంచీలు అందించడం మరియు పరీక్ష ప్యాడ్ లు పెన్నులు అందిచడం, యువకులలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంచుటకు క్రీడా పరికరాలు అందించి క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానోత్సవం చేయడం, ప్రమాద వసాత్తు మరణించిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించటానికి కృషి చేసి అందించటం, బ్రెయిన్ ట్యూమర్ తో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన బాలుడికి 4 విడుతలలో 8 లక్షల ఎల్ వో సి ఇప్పించి ఆదుకోవడం, బిక్షాటన చేసుకునే పేదలకు బ్లాంకెట్ల పంపిణీ చేయడం.నిరుద్యోగ యువకులు ఆర్థికంగా ఎదిగేందుకు జాగృతి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇప్పించడానికి అవగాహనా సదస్సులు నిర్వహించడం. పేద విద్యార్థులకు దుస్తులు, షూలు అందించడం పురస్కరాల సందర్భంగా ధర్మపురి లక్ష్మి నర్సింహా స్వామి ఆలయం వద్ద 12రోజులు ఉచిత వైద్య సేవలు అందించడం. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవడంతో పాటు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించినదుకు నంది అవార్డు ను అందుకున్నారు. గ్రామ ప్రజలు బంధువులు స్నేహితులు అభినందించారు.

**జగిత్యాల జిల్లా సమీపం లోని జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ సమస్యలను కె.సి.ఆర్. ను వారి ఫాం హౌజ్ లో కలిసి వివరించిన బి.ఆర్.ఎస్. గ్రామ అధ్యక్షుడు గడ్డం గంగా రెడ్డి.**



## టి 20 ఫైనల్స్ లో భారత్ గెలుపు

### వేములకుర్తిలో యువకుల సంబరాలు

ఇబ్రహీంపట్నం జూన్ 30 (ప్రజామంటలు):



టి 20 లో భారత్ గెలుపు పట్ల ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో ఆదివారం ఉదయం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాకాయలు కాల్చి మిఠాయిలను పంపిణీ చేసుకొని భారత్ గెలుపు సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో యువకులు అరె నరేందర్, బర్మా నాగేష్, రాధారపు జాన్సన్, మొగిలి బన్నీ, అన్నారపు రాకేష్, శ్రీకాంత్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ సోల్జర్ గా ఎన్నికైన వేంపేట గ్రామవాసి పాటుకూరి సాగర్

### సేవా భారతి ఆధ్వర్యంలో సన్మానం

మెట్టుపల్లి జూన్ 30 (ప్రజామంటలు):




మెట్ పల్లి మండలం వెంపేట గ్రామానికి చెందిన పాటుకూరి సాగర్ కు సేవాభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శాలువా కప్పి ఘన సన్మానం,ఆర్మీ సోల్జర్ గా ఎన్నికైన వెంపేట వాసికి సేవాభారతి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గాజంగి రాజమల్లయ్య మాట్లాడుతూ%ౌ%. వేంపేట గ్రామానికి చెందిన యువకుడు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఆర్మీ సోల్జర్ గా ఎన్నికవ్వడం గ్రామానికి గర్వకారణంగా ఉందన్నారు. దేశ సేవ కోసం ఈనాటి యువత తమ భవితని కేటాయించడం అభినందనీయం అన్నారు. అనంతరం ఆయన సేవాభారతి సభ్యులు అందరికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాజంగి జయకృష్ణ, బైరి దినేష్, గాజంగి రామస్వామి, అంబల్ల ధర్మరాజు, వివేక్, వినోద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడే జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ సమావేశము

### పాల్గొననున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు

జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు):

పద్మనాయక కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం పది గంటలకు బిఆర్ఎస్ పార్టీ సవావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారని, జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు తెలిపారు. కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రము అధికారం కోల్పోయిన తర్వాత కార్యకర్తలకు మనో స్థైర్యం ఇవ్వడానికి మొట్టమొదటి సారీగా కేటీఆర్ పాల్గొను కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ పేర్కొన్నారు. పార్టీ సముద్రం లాంటిది అని నాయకులు వస్తుంటారు. అధికారం పోగానే వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోతుంటారు. కేసీఆర్ తెచ్చిన తెలంగాణ రాష్ట్రములో ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు చేపట్టి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుందని బిఆర్ఎస్ పార్టీ లో ఉత్సాహమైన కార్యకర్తలు ఉన్నారని.. కార్యకర్తలకు, నాయకులకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని మనోధైర్యంతో ఉండాలని ప్రజల్లో కేసీఆర్ గారి పై విశ్వాసం ఉన్నదని ఒక బలమైన శక్తిగా ఉంటామని లంగాణ రాష్ట్రము రాకపోతే ఇంత అభివృద్ధి జరిగేదా.. అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి వర్యులు కొప్పుల ఈశ్వర్, జడ్పీ ఛైర్పర్సన్ దావ వసంత సురేష్, ఎమ్మెల్సీ యల్ రమణ, రాజేశం గౌడ్, అల్లాల దామోదర్ రావు, వొల్లెం మల్లేశం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి స్నేహమా! చిగురించే దీపమా!!

### 'ఆ' నాటి, 'ఆ' జ్ఞాపకాలు నెమరువేసుకున్న బాల్యమిత్రులు

భీమదేవరపల్లి జూన్ 30 (ప్రజామంటలు):




స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ముల్కనూర్ 1994- 1995 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళన సందర్భంగా సంతోషంగా రోజంతా గడిపారు. అప్పట్లో తమకు పాటలు నేర్పిన ఉపాధ్యాయులను పూలదండలు, శాలువల తో సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. సరస్వతి మాతకు పూలమాల వేసి సమావేశం ప్రారంభించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. సరిగ్గా 30 ఏళ్ల తరువాత వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఎంజాయ్ చేశారు.సుమారు 40 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొని ముఖాల్లో వెలుగులు నిండాయి. గడిచిన రోజులు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు జీవనోపాధి మార్గాలు అన్ని పంచుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు. పూర్వ విద్యార్థులు గుండెటి శ్రీకాంత్, దొంగల శ్రీనివాస్, అంచూరి శ్యాంసుందర్, ఉడుత శ్రీనివాస్, గుర్రాల రంజిత్, మూల రమేష్, అలుగు సంపత్, దార్న హరికృష్ణ, రేణిగుంట్ల రాజు, అప్పని రాజు, రాజేందర్, కుమాస్వామి, చక్రపాణి,సుహాసిని, స్వరూప, లీలావతి, షబానా, గౌరీ, తిరుమల, స్వప్న, పద్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం..

- సంపద సృష్టిస్తాం సంపదను ప్రజలకు పంచుతాం..
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన బేసిన డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క



మధిర ఆర్.సి జూన్ 30 (ప్రజా మంటలు):

రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు ఆదివారం మధిర మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర సంపద రాష్ట్ర ప్రజలకు చెందాలని తమ ప్రభుత్వం ఈ గ్యారెంటీలను తీసుకువచ్చింది అన్నారు. గత దశాబ్ద పాలనలో అప్పుల పాలైన తెలంగాణను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కిస్తున్నామని చెప్పారు. సంపదను సృష్టించి, సృష్టించిన సంపదను ప్రజలకు పంచుతామన్నారు. మధిర మండలం లో పలు బీటీ రోడ్లకు భట్టి విక్రమార్క శంఖుస్థాపన చేశారు.వంగవీడు గ్రామానికి చేరుకొని రూ. 30 కోట్లతో బోనకల్లు- అల్లపాడు- వంగవీడు గ్రామాల వరకు బిటి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద రూ.70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు, రూ.285 లక్షలతో చిలుకూరు నుంచి దొడ్డదేవరపాడు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మధిర మండలం మర్లపాడు గ్రామానికి చేరుకొని. రూ.275 లక్షలతో మర్లపాడు నుంచి పెనుగొలను-సిద్దినేని గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్తాపన చేశారు. ఆ తరువాత మాటూరు గ్రామానికి చేరుకొని రూ.500 లక్షలతో మాటూరు నుంచి ముస్లీం కాలనీ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఆనంతరం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారి పొడవున ఆయా గ్రామాల ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క వెంట కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని విభాగాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




## హెచ్‌సీజీ చేతికి మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్?

హైదరాబాద్:
విశాఖపట్నంలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను దేశంలోని అతిపెద్ద క్యాన్సర్ వైద్య సేవల సంస్థ అయిన హెచ్‌సీజీ సొంతం చేసుకోనుందని తెలుస్తోంది. రూ.414 కోట్ల విలువకు మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఈ సంస్థ కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తొలి దశలో రూ.208 కోట్లు చెల్లించి 51 శాతం వాటాను హెచ్‌సీజీ కొనుగోలు చేస్తుంది. మిగిలిన వాటాను తర్వాత దశల వారీగా సొంతం చేసుకునే అవకాశం ఉంది. తన చేతికి వచ్చిన తర్వాత మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పడకల సంఖ్యను పెంచడంతో పాటు వైద్య సేవలను విస్తరించాలని హెచ్‌సీజీ భావిస్తోంది. విశాఖపట్నంలో క్యాన్సర్ వైద్య సేవలకు ఇటీవల కాలంలో గిరాకీ బాగా పెరుగుతోంది. ఈ అంశాన్ని హెచ్‌సీజీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హెచ్‌సీజీ బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. ఈ సంస్థ మనదేశంతో పాటు ఆఫ్రికా దేశాల్లో 21 క్యాన్సర్ ఆస్పత్రులను నిర్వహిస్తోంది.

## సెల్‌కాన్ గ్రూపు నుంచి వైఫై-6 రౌటర్లు

**తిరుపతిలోని ఈఎంసీ-1 క్లస్టర్‌లో ఆగస్టు నుంచి ఉత్పత్తి**

**ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన జడ్‌టీఈ ప్రతినిధులు సచిన్ బాత్రా, లేవో ఛావ్, గోవో జన్, సెల్‌కాన్ సీఎండీ వై.గురు, రమీందర్ సోయిన్**

హైదరాబాద్: మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, యాక్సెసరీలు అందిస్తున్న సెల్‌కాన్ గ్రూపు వైఫై-6 రౌటర్ల విభాగంలోకి అడుగుపెడుతోంది. తిరుపతిలోని ఎలక్ట్రానిక్స్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ-1) లోని సెల్‌కాన్ రిసొల్యూట్‌కు చెందిన కొత్త ప్లాంటులో ఈ ఏడాది ఆగస్టు నుంచి వైఫై-6 రౌటర్లను ఉత్పత్తి చేయనున్నారు. దీని కోసం చైనా దిగ్గజ సంస్థ జడ్‌టీఈ టెలికాంతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. సెల్‌కాన్ రిసొల్యూట్ ప్లాంటులో నెలకు 2 లక్షల యూనిట్లు ఉత్పత్తి చేయవచ్చని, దేశీయ మార్కెట్ అవసరాలు తీర్చడంతో పాటు విదేశాలకు రౌటర్లను ఎగుమతి చేయాలనేది తమ లక్ష్యమని సెల్‌కాన్ గ్రూపు సీఎండీ వై.గురు వెల్లడించారు. ఈ ప్లాంటు సామర్థ్యాన్ని 5 లక్షల యూనిట్లకు పెంచుతామన్నారు. ఇంటర్నెట్ కనెక్టివిటీ, వేగాన్ని పెంపొందించడంలో స్మార్ట్ సిటీల అభివృద్ధిలో, నగరాల్లో ట్రాఫిక్‌ను సమర్థంగా నిర్వహించడంలో వైఫై-6 సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్‌టీఈ టెలికాం ఇండియా సీఈఓ లేవో ఛావ్, రిసొల్యూట్ గ్రూపు వ్యవస్థాపకుడు రమీందర్ సోయిన్‌లతో కలిసి వై.గురు అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జడ్‌టీఈ గ్రూపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావడం శుభసూచకమని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సంస్థ తన అన్ని రకాలైన ఉత్పత్తులను ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేయడానికి ముందుకు రావాలని లోకేశ్ కోరారు.

# స్టాక్స్.. టీ20 కప్ విజయం మధ్య సారూప్యతేంటి?.. వివరించిన సెహ్వాగ్!



దిల్లీ: స్టాక్స్, భారత్ టీ20 కప్ గెలవడం మధ్య సారూప్యత ఏమైనా ఉందా?.. ఏంటా అని ఆలోచిస్తున్నారు కదా! భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఈ రెండింటి మధ్య చక్కని పోలికను వివరించారు.

కప్పు గెలిచిన సందర్భంగా భారత జట్టుకు శుభాకాంక్షలు తెలుపుతూ.. దాన్ని స్టాక్‌మార్కెట్‌కు అన్వయిస్తూ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.

స్టాక్‌లలో లాగా సుదీర్ఘ స్థిరీకరణ తర్వాత భారత జట్టుకు ఒక బ్రేకౌట్ లభించింది. ఏళ్లపాటు నిరోధం ఎదుర్కొన్న స్టాక్ ఒక్కసారిగా కొన్నేళ్ల రికార్డును దాటు తుంటుంది. టీమ్‌ఇండియాకు కూడా బహుశా అలాంటి బ్రేకౌట్ విజయమే. ఏళ్లుగా ఒక రేంజ్‌లో నిలకడగా ఆడుతూ వచ్చింది. జట్టు చక్కగా కుదురుకుంది. కానీ, ఐసీసీ ట్రోఫీల్లాంటి నిరోధాలను మాత్రం అధిగమించలేకపోయింది. తాజాగా లభించిన విజయం బహుశా 13 ఏళ్ల బ్రేకౌట్‌గా అనిపించింది. ఇక నుంచి ఐసీసీ టోర్నీల్లో భారత్ వరుస విజయాలను నమోదు చేస్తుందని విశ్వసిస్తున్నా" అని సెహ్వాగ్ పోస్ట్ చేశారు. భారత్ 2011లో వన్డే వరల్డ్ కప్ సాధించిన తర్వాత ఒక్క ఐసీసీ ట్రోఫీని కూడా సొంతం చేసుకోలేదు.

స్టాక్ మార్కెట్‌లో ఒక షేరు నిర్దిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత నిరోధం ఎదుర్కొంటుంటుంది. అంటే ఆ స్థాయిని మించి పైకి వెళ్లలేకపోతుంది. ఇది కంపెనీ పనితీరు, మార్కెట్ పరిస్థితులు, ఇన్వెస్టర్ల ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. అయితే, పరిస్థితులు అనుకూలించినప్పుడు దాన్ని దాటుకొని ఒక్కసారిగా భారీ లాభాల్లోకి దూసుకెళ్తుంది. దీన్ని బ్రేకౌట్‌గా వ్యవహరిస్తారు. అప్పుడు ఆ స్టాక్‌కు కొత్త రికార్డులను నెలకొల్పుతూ నూతన నిరోధ స్థాయిని ఏర్పరచుకుంటుంది. సాధారణంగా స్టాక్ విలువ గరిష్ఠానికి చేరినప్పుడు నిరోధం ఎదురవుతుంది. అంటే ఆ షేరుకు అంతకు మించి వెచ్చించడం అవసరం లేదని మదుపర్ల భావన!

తాజాగా భారత జట్టు సైతం ఏళ్లుగా నిరోధ స్థాయిని ఎదుర్కొందని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. ఇక్కడ ఐసీసీ ట్రోఫీలను ఆయన నిరోధంగా వ్యవహరించారు. తాజాగా దాన్ని అధిగమించి విజయం సాధించటంతో బ్రేకౌట్ లభించినట్లు అభివర్ణించారు. ఇకపై వరుస విజయాలతో రికార్డులు నెలకొల్పుతుందని ఆకాంక్షించారు.

# ఆతిథ్య రంగంలో 10 లక్షల ఉద్యోగాలు!

## వచ్చే కొన్నేళ్లలో రావొచ్చని విశ్లేషకుల అంచనా



ముంబయి: వచ్చే కొన్నేళ్లలో ఆతిథ్య రంగం సుమారు 10 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

కొవిడ్-19 మహమ్మారి తర్వాత ఈ రంగం వేగంగా విస్తరిస్తోందని, అయితే ఈ రంగంలో ప్రతిభావంతుల కొరత ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రతిభావంతుల గిరాకీ-సరఫరా వ్యత్యాసం సుమారు 55-60 శాతం మధ్య ఉన్నట్లు అంచనా.

ఆతిథ్య రంగంలో అవసరమైన మేరకు ప్రతిభావంతులు ఉండట్లేదని ప్రొఫెషనల్ టాలెంట్ సొల్యూషన్స్ ర్యాండ్‌స్టాడ్ ఇండియా డైరెక్టర్ సంజయ్ శెట్టి వెల్లడించారు. కొవిడ్ తర్వాత ఈ రంగంలో ఉద్యోగాలకు ఒక్కసారిగా గిరాకీ పెరగడంతోనే కొరత ఏర్పడిందని, వచ్చే కొన్నేళ్లపాటు ఈ ధోరణి కొనసాగుతుందని పేర్కొన్నారు. కనీసం 10 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని తెలిపారు.

కొవిడ్ తర్వాత మొత్తం నియామకాలు నాలుగు రెట్లు పెరిగాయి. గత రెండేళ్లలో అత్యధికులు కోరినట్లుగా ప్రారంభ స్థాయి (ఎంట్రీ లెవెల్) ఉద్యోగాలు ఆవిర్భవించాయని పరిశ్రమ దిగ్గజాలు పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు ఇప్పటికే ఉన్న వారికి నైపుణ్యాలు అభివృద్ధి చేసి వారి ప్రతిభను పెంచుతున్నాయి. మరోవైపు కొరతను పూరించడానికి ఇతర పరిశ్రమల నుంచి నియమించుకుంటున్నాయి.

కొన్ని కంపెనీలు ప్రతిభావంతులను నిలుపు కోవడా నికి పోటీ వేతనాలు, ప్రయోజనాలు అందిస్తున్నాయి. '2023లో పర్యాటక, ఆతిథ్య పరిశ్రమ సుమారు 1.11 కోట్ల మందికి ఉపాధిని కల్పించింది. 2024 చివరకు 1.18 కోట్ల మంది అవసరమవుతారని అంచనా వేస్తున్నాం. 2028 నాటికి గిరాకీ 16.5 శాతం వార్షిక వృద్ధితో 1.48 కోట్లకు చేరుతుంద'ని టీమ్‌లీజ్ డిగ్రీ అప్రెంటిస్‌షిప్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ ధృతి ప్రసన్న మహంత పేర్కొన్నారు.

భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు ప్రస్తుతం మానవ వనరులు లేవని స్టాఫింగ్ టీమ్‌లీజ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ ఎ.బాలసుబ్రమణియన్ వెల్లడించారు. 2023లో టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ (టీహెచ్‌ఎస్‌సీ) అందించిన గణాంకాల ప్రకారం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో అందుబాటులో ఉన్న సీట్లలో కొన్నింటిని మాత్రమే నింపారని పేర్కొన్నారు.



## దేశ అత్యున్నత అధికారులుగా.. చిన్ననాటి స్నేహితులు

దిల్లీ: బాల్య స్నేహితులిద్దరు దేశ రక్షణదళాల అత్యున్నత కమాండర్లుగా మారారు. వీరు మరెవరో కాదు దేశంలోని ఆర్మీ అధిపతులు. అడ్మిరల్ దినేష్ త్రిపాఠి భారత నౌకాదళ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. దినేష్ త్రిపాఠి, ఉపేంద్ర ద్వివేది 1970లో మధ్యప్రదేశ్ రేవాలోని సైనిక్ స్కూల్ లో కలిసి చదువుకున్నారు. నాటి నుంచే వారిద్దరి మధ్య బలమైన స్నేహబంధం ఉంది. ప్రస్తుతం వారు వేర్వేరు దళాలకు నాయకత్వం వహిస్తున్నప్పటికీ పరస్పరం సలహా సంప్రదింపులు జరుపుతుంటారు. రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి భరత్ భూషణ్ బాబు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని పోస్ట్ చేస్తూ.. "ఇద్దరు అద్భుతమైన విద్యార్థులను మిలటరీలో అత్యున్నత సేవలు అందించగలిగే అధికారులుగా తీర్చిదిద్దిన అరుదైన గౌరవం రేవాలోని సైనిక్ స్కూల్‌కు దక్కుతుంది" అని అభినందించారు. 1964 జులై 1న జన్మించిన లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది 1984 డిసెంబర్ 15న సైన్యంలో చేరారు. అనంతరం వివిధ కీలక పోస్టుల్లో పనిచేశారు. నార్తర్న్ ఆర్మీ కమాండర్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారు.

**జనరల్ మనోజ్ పాండే పదవీ విరమణ**

ఆర్మీ చీఫ్‌గా రెండేళ్లు దేశానికి సేవలందించిన జనరల్ మనోజ్ పాండే ఆదివారం పదవీ విరమణ చేశారు. ఆయన్ను గార్డ్ ఆఫ్ హానర్‌తో అధికారులు గౌరవించారు. పాండే 2022 ఏప్రిల్ 30న ఆర్మీ చీఫ్‌గా నియమితులయ్యారు. వాస్తవానికి ఆయన మే 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆయన సర్వీసును ఒక నెల పొడిగించింది. దీంతో జూన్ 30న పదవీ విరమణ చేశారు.

## గుంటూరులో 113.2 మి.మీ. వర్షపాతం

**గుంటూరు జూన్ 30 (ప్రజా మంటలు):**
గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం వరకు సగటున 60.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమ మండలంలో అత్యధికంగా 113.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకాగా..ప్రత్తిపాడు 95.4, గుంటూరు తూర్పు 80.4, వట్టిచెరుకూరు 78.2, చేబ్రోలు 77, ఫిరంగిపురం 66.2, మంగళగిరి 61.6, పెదకాకాని 59.2, తాడికొండ 56.4, తుళ్ళూరు 52.4, పొన్నూరు 51.4, మేడికొండూరు 49.4, తెనాలి 49, తాడేపల్లి 48.6, కొల్లిపర 40.4, కాకుమాను 39.8, దుగ్గిరాల 37.8, పెదనందిపాడు 32.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. గుంటూరు నగరం బ్రాడీపేట 2వ లేనులో ఓ వృక్షం నేలవాలింది. ఆదివారం తెల్లవారు జామున ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చెట్లు రోడ్డుపైకి పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఓ కారు ఆగి ఉండటంతో ఆ వాహనంపై చెట్టు కూలింది. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# పూరీ జగన్నాథుడి రథయాత్రకు 315 ప్రత్యేక రైళ్లు

దిల్లీ: పూరీ జగన్నాథుడి విశ్వప్రసిద్ధ రథయాత్ర మహోత్సవాలు జులై 6 నుంచి జులై 19 వరకు జరగనున్నాయి. లక్షలాది మంది ఈ వేడుకల్లో పాల్గొననున్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 315 ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, డిప్యూటీ సీఎంలు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడలకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాచారమిచ్చారు. ఒడిశాలోని అన్ని ప్రధాన పట్టణాల మీదుగా రైళ్లు నడిచేలా అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. బాదం పహాడ్, రూర్కెలా, బాలేశ్వర్, సోనేపుర్, దస్‌పల్లా, జునాగఢ్ రోడ్, సంబల్‌పుర్, కేందుజుహర్‌గఢ్, పారాదీప్, భద్రక్, అనుగుల్‌బీ గుణుపుర్ నుంచి ప్రత్యేక రైళ్లు ప్రారంభమవుతాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. సంధ్యా దర్శన్, బహుదా యాత్రకు వచ్చే భక్తుల కోసం కూడా ప్రత్యేక రైళ్లను నడిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొంది.

దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి కూడా కొన్ని ప్రత్యేక రైళ్లను నడిపే అవకాశం ఉంది. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. వేడుకలు కొనసాగినన్నాళ్లు భక్తులతో పూరీ రైల్వే స్టేషన్ రద్దీగా మారే అవకాశమున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఫకువాల్ తెలిపారు. రైల్వేశాఖ తరఫున సుమారు 15 వేల మంది భక్తులకు ఆశ్రయం కల్పించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆనవాయితీ ప్రకారం జగన్నాథుడు సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి గుండిచా మందిరానికి మూడు వేర్వేరు రథాల్లో చేరుకుంటారు. ఆషాఢ శుక్లపక్షమి హరిశయన ఏకాదశి రోజున నిర్వహించే అపురూప ఘట్టం కోసం లక్షలాది మంది ఎదురు చూస్తుంటారు. ఆ రోజున పెద్దమొత్తంలో రైళ్లు నడపాలని అధికారులు భావిస్తున్నారు.




## ఏపీ వాలంటీర్లకు త్వరలో గుడ్‌న్యూస్ మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి జూన్ 30 (ప్రజా మంటలు):** ఏపీలో సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతున్న వాలంటీర్లపై త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. నిడదవోలులో ఆయన మీడియాతో ఆదివారం మాట్లాడారు. గత ప్రభుత్వానికి మించి కూటమి సర్కారు సంక్షేమం అందిస్తోందని, రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. వెయ్యి పెంచగా, కూటమి అధికారంలోకి రాగానే వెయ్యి పెంచి మూడు నెలలతో కలిపి మొత్తం రూ. 7 వేలు ఇస్తుందని పేర్కొన్నారు. జులై 1వ తేదీ నాడే 90 శాతం వరకు పింఛన్ల పంపిణీ చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. వైసీపీ ఐదేండ్ల పాలనలో ప్రభుత్వ విధానాలు అస్తవ్యస్తంగా జరగటం వల్ల అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు.



## జులై 6 నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాస సారె మహోత్సవాలు : ఈవో

**అమరావతి జూన్ 30 (ప్రజా మంటలు):**



విజయవాడలోని ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జులై 6 నుంచి సారె మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామారావుతెలిపారు. ఆదివారం ఆలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలరోజులపాటు జరుగనున్న ఆషాడమాస సారె ఉత్సవాల్లో భక్తులు సారె సమర్పించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు .జులై 19 నుంచి ఇంద్రకీలాద్రిపై మూడు రోజుల పాటు శాకాంబరి దేవి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈసారి తొలిసారిగా వారాహి ఉత్సవాలను నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జులై 6 నుంచి 15 వరకు వారాహి ఉత్సవాలు, జులై 14న తెలంగాణ మహంకాళీ ఉత్సవ కమిటీ బోనాల సమర్పణ చేస్తామన్నారు. మహానివేదన సమయంలో ప్రోటోకాల్ దర్శనాలను ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిలిపివేస్తామని ప్రకటించారు.

## రూ.12,000 కోట్ల సమీకరణలో ఎన్‌టీపీసీ

**దిల్లీ (ప్రజా మంటలు):**
ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ.. మార్పిడి రహిత డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.12,000 కోట్లను సమీకరించనుంది. ఇందుకు శనివారం ఆ సంస్థ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనకు వాటాదార్ల అనుమతిని తీసుకోవాల్సి ఉంది. 'దేశీయ విపణిలో ఒకటి లేదా 12 వరకు విడతల్లో సెక్యూర్డ్/అన్‌సెక్యూర్డ్, రెడీమబుల్, పన్నుతో కూడిన/పన్ను రహిత, క్యుములేటివ్/నాన్ క్యుములేటివ్ ఎన్‌సీడీల జారీ ద్వారా రూ.12,000 కోట్లను సమీకరించే ప్రతిపాదనకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనపై ప్రత్యేక తీర్మానానికి ఆమోదం లభించిన రోజు నుంచి ఏడాది కాలంలోగా లేదంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో జరిగే తదుపరి వార్షిక సాధారణ సమావేశం తేదీ వరకు ఏదీ ముందైతే అప్పటిలోగా ఈ బాండ్ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని ఆ ప్రతిపాదనలో పొందుపర్చినట్లు' స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎన్‌టీపీసీ తెలిపింది. ఇష్యూ పరిమాణం, కాలపరిమితి, నమోదు వివరాలు (బీఎస్‌ఈ లేదా ఎన్‌ఎస్‌ఈ లేదా రెండింటిలో), కూపన్, సెక్యూరిటీ, ఇతరత్రా వివరాలను ప్రతి ఒక్క విడత ప్రారంభంలో నిర్ణయిస్తామని పేర్కొంది.

# గ్రూప్స్, నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం

## గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్

## పరామర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

## ఏడు రోజుల నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు

హైదరాబాద్ జూన్ 29 (ప్రజామంటలు):
వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగుల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీని స్తంభింప చేస్తాం. ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి మోతిలాల్ నాయక్ తో మాట్లాడాలి, వారి సమస్యలు పరిష్కరించాలి. ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులతో చర్చ జరపాలి. ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే దాకా నిరుద్యోగులు తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది. ఎంతవరకైనా తెగించి కొట్లాడుతుంది. నిరుద్యోగ యువతీ యువకులకు బీఆర్ఎస్ పూర్తి అండగా ఉంటుంది. మోతిలాల్ నాయక్ దీక్ష విరమించాలని మీడియా సాక్షిగా విజ్ఞప్తి చేస్తున్నాను. కలిసి ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిస్తున్నాను.

మోతీలాల్ కు ఏం జరగక ముందే ప్రభుత్వం తక్షణంగా స్పందించాలి. అతని ఆరోగ్యం పట్ల ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత.

కోదండరాం పిల్లల హక్కుల పట్ల పూర్తి బాధ్యత తీసుకోవాలి. అమలు చేసే విధంగా ముందుకు రావాలి. మోతీలాల్ నాయక్ ఏడు రోజుల నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేకపోవడం దురదృష్టకరం. మోతిలాల్ దీక్ష విరమించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన అందరం కలిసి కోరాం. ఇది నా ఒక్కడి పోరాటం కాదు తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న అన్నడు. ప్రభుత్వం దిగివచ్చేదాకా దీక్ష విరమించెను అని చెప్పిండు. పదేపదే కన్విన్స్ చేసే ప్రయత్నం చేసాం, అందరం కలిసి పోరాటం చేద్దాం, మేము మీ వెంట ఉన్నాం, ప్రాణం ముఖ్యం, తండ్రి లేని వాడివి అని కన్విన్స్ చేసే ప్రయత్నం చేశాం. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ చూపెట్టి నిరుద్యోగులను వాడుకొని వదిలిపెట్టారు. ఎన్నికలు అయిపోయాక నిరుద్యోగుల గుండెల మీద తన్నుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.

**ఓడ దాటే దాకా ఓడ మల్లన్న**
**ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్లు ఉంది.**

ఆనాడు నిరుద్యోగుల కోసం ప్రొఫెసర్ కోదండరాం, రియాజ్, బల్మూరి వెంకట్, మురళి, రేవంత్ రెడ్డి అశోక్ నగర్ లో కోచింగ్ సెంటర్లు చుట్టూ తిరిగారు. బస్సు యాత్రలు చేశారు.






రాహుల్ గాంధీని అశోక్ నగర్ కు తీసుకువచ్చి ప్రామిస్లు చేయించారు. మీకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి, నిరుద్యోగులకు రాలేదు. ఎందుకు మీ గొంతులు మూగబోయాయి? రాహుల్ గాంధీ అశోక్ నగర్ కు వచ్చి రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఏడు నెలలు పూర్తయింది ఎందుకు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వలేదు.

**రాహుల్ గాంధీ కి మా నిరుద్యోగుల బాధలు కనపడడం లేదా?**
**వినపడడం లేదా?**

నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే పోరాటాలు చేస్తుంటే ఎందుకు రాహుల్ గాంధీ గారు పట్టించుకోరు. రేవంత్ రెడ్డి కి చెప్పాలని ట్విట్టర్ వేదికగా రాహుల్ గాంధీ ట్యాగ్ చేస్తూ నిరసన తెలియజేస్తే పట్టించుకోరు. అశోక్ నగర్ లో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రాహుల్ గాంధీ చొరవ చూపాలి రేవంత్ రెడ్డి గారికి డైరెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న. నిరుద్యోగులను రెచ్చగొట్టే విధంగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు, గ్రామాల్లోకి వెళ్లి ఓట్లు వేయాలని అడిగారు. చిటికెలో చేస్తా అన్నారు. 7 నెలలు గడిచినా చేయడం లేదు.

**బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన హామీలు ఏమయ్యాయి:**

అసెంబ్లీలో భట్టి విక్రమార్క 1: 100 ఎలిజిబిలిటీ గ్రూప్ వన్ మెయిన్స్ కి ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ కోదండరాం ఇదే నిరుద్యోగులను రెచ్చగొట్టారు. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు. ఉమ్మడి ఏపీలో, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో పెంచడం సాధ్యమైనప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యంకాదో రేవంత్ రెడ్డి, కోదండ రామిరెడ్డి సమాధానం చెప్పాలి. ప్రజా పాలనలో నిరుద్యోగులు దరఖాస్తులు ఇస్తూ చిన్నారెడ్డి గారి కాళ్ళ మీద పడితే ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. నిరుద్యోగులు యువకులు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇదేనా ప్రజాపాలన? విద్యార్థులు న్యాయమైన డిమాండ్ అడుగుతున్నారు మీరు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.



## 4 క్వింటాల్ల పిడిఎస్ రైస్ ను పట్టుకున్న పోలీసులు

మహదేవపూర్ జూన్ 30 (ప్రజామంటలు):
మండలం కేంద్రం గుండా మహారాష్ట్ర కు అక్రమంగా తలిస్తున్న నాలుగు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పవన్ కుమార్ తెలిపిన కథనం ప్రకారం భూపాలపల్లికి చెందిన పొన్న శ్రీనివాస్ పొన్న రాజేష్ అనే వ్యక్తులు ఓమ్ని వాహనంలో అక్రమంగా బియ్యాన్ని తలరిస్తున్నారని సమాచారం మేరకు మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించి పిడిఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు.నిందితులపై 6%ఖ% ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

## మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ కై నిధులు మంజూరు నిమిత్తం కలెక్టర్ ను కల్సిన ఎమ్మెల్సీ, విప్



జగిత్యాల జూన్ 29 (ప్రజా మంటలు):
జగిత్యాల పట్టణం మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలుతోపాటు యావర్ రోడ్డును 100 ఫీట్ల మేరా విస్తరణ చేపట్టేందుకు అవసరమైన కొరకు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మాజీ మంత్రి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి , ధర్మపురి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు కలిసి వినతి పత్రం అందజేసినారు.

## కొండగట్టు ఘాట్ రోడ్ నుంచి గుట్ట మీద వరకు 500 మొక్కలు నాటిన మెకానిక్

జగిత్యాల జూన్ 29 (ప్రజామంటలు):



కొండగట్టు ఘాట్ రోడ్ నుంచి గుట్ట మీద వరకు శనివారం హుస్నాబాద్ కు చెందిన సత్యనారాయణ అనే సామాజిక సేవకుడు 500 మొక్కలను తన సొంత ఖర్చుతో నాటాడు. ప్రస్తుతం సత్యనారాయణ కరీంనగర్ వర్క్ షాప్ సమీపంలో మెకానిక్ గా పనిచేస్తున్నాడు. గతంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం, శాతవాహన యూనివర్సిటీ, రైల్వే స్టేషన్, కోర్టు, స్మశానవాటిక ఆవరణలో సుమారు 70 వేల మొక్కలు సొంత డబ్బులతో నాటానని ఆయన తెలిపారు. చెట్లు నాటడం అందాల కోసం మాత్రమే కాదని, వీటివల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, మనవాళ్ళకి అవసరమైన ఆక్సిజన్ కూడా ఉంటుందని తెలిపారు . చెట్లు నాటడం అంటే చిన్ననాటి నుంచి చాలా ఇష్టమన్నారు.

## ధర్మపురి శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

నిజామాబాద్ జూన్ 29 (ప్రజామంటలు):



పీసీసీ అధ్యక్షుడుగా 2004 లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి డీఎస్ ఎంతో కృషి చేశారు. 2009 లోనూ డీఎస్ సారథ్యంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి వచ్చింది. విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వ్యక్తి డీఎస్. కొంతకాలం పార్టీకి దూరమైనా పార్లమెంట్ లో డీఎస్ ను సోనియాగాంధీ ఆప్యాయంగా పలకరించేవారు. పదవులపై తనకు ఎప్పుడూ ఆశ లేదని డీఎస్ అనేవారు. చనిపోయినపుడు తనపై కాంగ్రెస్ జెండా కప్పాలని డీఎస్ కోరిక. అందుకే ముఖ్య నాయకులను పంపి వారి కోరిక తీర్చాము. డీఎస్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ అండగా నిలబడుతుంది. కుటుంబ సభ్యులతో చర్చించి డీఎస్ జ్ఞాపకార్థం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం. డీఎస్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు.

## కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను గజమాలతో సత్కరించిన బీజేపీ నాయకులు



చిగురుమామిడి జూన్ 30 (ప్రజామంటలు):
కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ హుస్నాబాద్ పర్యటనలో భాగంగా చిగురుమామిడి మండలం మీదుగా వెళుతున్న సందర్భంలో చిగురుమామిడి మండలం చిన్న మల్కనూర్ లో గజమాలతో సత్కరించిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ బీజేపీ నాయకులు పోలో సంతోష్ పీచుపల్లి మాజీ ఉప సర్పంచ్ బుద్దార్తి మహేందర్, మకుటం సంపత్, గొల్లపల్లి సదాచారి, బూత్ అధ్యక్షులు పెసరి హరీష్, చందు, శ్యామకూర శేఖర్ రెడ్డి, గట్టు ఎల్లయ్య, బీజేవైఎం నాయకులు సిద్దంకి అనిల్, సందవేని నగేష్, ప్రతినవ్ రెడ్డి, మీరుదొడ్డి ప్రశాంత్, కోయడ నాగార్జున్, నమలికొండ ప్రశాంత్, గట్టు అజయ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అమల్లోకి కొత్త చట్టాలు

### కొత్త చట్టాలపై విడతలవారీగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ పూర్తి

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్




జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు):
జూలై 1 అనగా రేపటి నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు-2023 అమలులోకి రానున్నట్లు జిల్లా ఎస్పి పేర్కొన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం లభిస్తాయన్నారు. అమల్లోకి రానున్న కొత్త చట్టాలు మనదేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయని పేర్కొన్నారు. ఈ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతులలో మార్పు వస్తుందని, ప్రజలకి మరింత సమర్థవంతంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు.కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు - లిభారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్యా అధినియం. జిల్లాలోని ఉన్న పోలీసు అదికారులకు , సిబ్బందికి విడతలవారీగా శిక్షణ కార్యక్రమని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సమకాలీన కాలం మరియు వాడుకలో ఉన్న సాంకేతికతలకు అనుగుణంగా అనేక కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందని, బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలకు చాలా రూపొందించడం జరిగిందని అన్నారు. కొత్త చట్టాల వర్తింపు మరియు నేరాలు మరియు దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీసు శాఖకు చెందిన డిఎస్పీ నుండి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

## టెలీ కాన్ఫరెన్స్ లో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



హైదరాబాద్ జూన్ 30 (ప్రజామంటలు): జగిత్యాల నియోజవర్గ కార్యకర్తలతో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ.... సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే కాంగ్రెస్ పార్టీలో చేరా నన్నారు. నా చేరిక పై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి సమాచారం లేదన్నారు. నాతో కలిసి నడవాలని కార్యకర్తలను కోరుతున్నానన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు బి.ఆర్.ఎస్. లో చేరి తమ ప్రాంతాలు అభివృద్ధి చేసుకున్నారు. అదే తరహాలో నేను కూడా కాంగ్రెస్ పార్టీలో చేరానని, అలాగే జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

## గానకోకిల కళానికేతన్ అధ్యక్షులుగా రవికుమార్, ప్రధాన కార్యదర్శి గా ఎలగందుల రవి



జగిత్యాల జూన్ 30 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లాలో మూడు దశాబ్దాల క్రితం నెలకొల్పిన గాన కోకిల కళానికేతన్ కళా సంస్థ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జగిత్యాల టౌన్ హాల్లో కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి రెండు సంవత్సరాల కాలపరిమితి కోసం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. అధ్యక్షులుగా మాన్యం రవికుమార్, ప్రధాన కార్యదర్శి గా ఎలగందుల రవి ఉపాధ్యక్షులుగా జంగిలి గోపి, కోశాధికారిగా తోకల రమేష్ సంయుక్త కార్యదర్శి గా కుంటాల శ్రీను, ఆర్గనైసింగ్ కార్యదర్శిగా మచ్చ రవీందర్ లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ, న్యాయ సలహదారులుగా పుప్పాల అశోక్, గౌరవ సలహాదారులుగా మామిడిపెల్లి అర్జున్ కుమార్, ముఖ్య సలహదారులుగా క్యాదాసు నాగయ్య, చిట్ల రవీందర్,వాసాల వెంకటేశ్వర్లు ఎన్నికయారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎన్నో కళా సంస్థలకు జీవం పోసి తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలను మెప్పించిన జానపద గేయాలు ఈ కళా సంస్థనుండి వెలువరించి గాన కోకిల కలనికేతన్ ప్రభంజనం సృష్టించిందని నూతన అధ్యక్షుడు మాన్యం రవికుమార్ తెలిపారు. కార్యవర్గం ఎన్నికపట్ల జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, కళాకారులు తదితరులు అభినందించారు.

## నవయాన బుద్ధిష్ట్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక

మెట్ పల్లి జూన్ 30 (ప్రజామంటలు):
మెట్ పల్లి నవయాన బుద్ధిష్ట్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక మెట్ పల్లి పట్టణంలో నవయాన బుద్ధిష్ట్ సొసైటీ సభ్యులు మావేశం ఏర్పాటు చేసి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దయరాజరామ్ అడ్వకేట్ అధ్యక్షులు నిరడి నరేందర్, ప్రధాన కార్యదర్శి మీడియా ఇంచార్జ్ గోరుమంతుల సురేందర్, ఉపాధ్యక్షులు సోమిడి మహేందర్, కార్యదర్శులు, నల్ల పురుషోత్తం, దయ్య రఘు,, గోరుమంతుల మురళీ, దిబ్బ అంజయ్య, నిరాటి రాజేందర్, సొమిడి శ్యామ్ ప్రసాద్, బత్తుల ప్రమోద్, కావాలి బాలకిషన్, మద్దెల లక్పతి వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com